క్లుప్తంగా

మాజీ మంత్రి కాకాణితో ఎమ్మెల్సీ భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించుకున్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విజయవాడలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆక్వా రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న లలితా శివజ్యోతి

నెల్లూరు(పొగతోట): ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలితా శివజ్యోతి అన్నారు. నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని, మాట్లాడారు. ఆక్వా రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ఆక్వా రంగం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్య విభాగం శాస్త్రవేత్త శ్రీహరిప్రసాద్, డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆటల పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని డీఎల్ఎన్నార్ పాఠశాలలో శనివారం, ఆదివారం ఆటల పోటీలు నిర్వహిస్తామని ఇషా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. వారు శుక్రవారం పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 14 ఏళ్లు నిండిన వారు ఆటల పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వాలీబాల్, త్రోబాల్ తదితర ఆటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 76618 08710 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం అమ్మవారికి నవావరణ పూజ, ఖడ్గమాల, సహస్ర నామార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన, పంచామృతాభిషేకం, నిత్య కల్యాణాన్ని ఆలయ పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారిని పల్లకిపై ఊరేగించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

ఆలయంలో ప్రసిద్ధ కళాకారులు పద్మ, హేమలక్ష్మి, నాగలక్ష్మి వీణ వాయిద్యంతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తి గీతాలు, శాస్త్రీయ రాగాల సమ్మేళనంతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

శ్రావణం.. సౌభాగ్యం

- సామూహికంగా లక్ష కుంకుమార్చనలు
- విశేషాలంకారాల్లో కొలువైన అమ్మణ్ణి

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసం ఐదో శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష రూపాల్లో కొలువైన జగజ్జననికి విశేష పూజలు నిర్వహించారు. సౌభాగ్యాలు ప్రసాదించాలని వేడుకుంటూ సామూహికంగా లక్షకుంకుమార్చనలు చేశారు.

⇨ రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన, పల్లకిసేవలు నిర్వహించారు. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారు విశేష పుష్పాలంకరణలో కటాక్షించారు. మూలవర్లను ధాన్యంతో ప్రత్యేకంగా అలకరించారు. పూలంగిసేవ, పల్లకిసేవల ఉభయకర్తలుగా కొలపర్తి వెంకట రమేష్‌కుమార్– సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. అర్చకుడు రఘురామమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి కుంభహారతులు ఇచ్చారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

⇨ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఈ క్రమంలో సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పావురాళ్ల రమేష్–సుజాత దంపతులు వ్యవహరించారు. ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

⇨ రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. బ్రాహ్మణసేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. ఉభయకర్తలుగా వేణుంబాక శివకల్యాణ్‌రెడ్డి– చైతన్య దంపతులు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి



రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన

దేవస్థానంలో స్వామివార్లకు పల్లకిసేవ, ఊంజల్‌సేవలు నిర్వహించారు. ఉభయకర్తలుగా హరికుమార్‌రెడ్డి– మాధురి దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

⇨ స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి వారాహి పుష్పపూజ నిర్వహించారు. కుంకుమ అలంకారంలో అమ్మణ్ణి దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పిండి వెంకటలక్ష్మి, పద్మావతి బృందం వ్యవహరించింది. సాయంత్రం పూలంగిసేవ కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కాకుమాని రామ్మోహన్‌రావు–ప్రమీల దంపతులు వ్యవహరించారు. రాత్రి 108 మంది మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. ఉభయకర్తలుగా అచ్యుత శివమణికంఠ–జానకిదేవి దంపతులు వ్యవహరించారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు, గౌరవ సలహాదారు ఆంజనేయులు పర్యవేక్షించారు.

⇨ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. మందిర కమిటీ అధ్యక్ష,



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో..

కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, ఎన్వీ రత్నం, కోశాధికారి కె.శివప్రసాద్, అమరా మోహన్‌రావు, ఎస్.హనుమంతరావు పర్యవేక్షించారు.

⇨ రామ్‌నగర్‌లోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని వివిధ చీరలతో అలంకరించారు. కుంకుమపూజ నిర్వహించారు

⇨ నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయం, మూలాపేట సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో పూజలు విశేషంగా నిర్వహించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



రామ్‌నగర్ మహాలక్ష్మి ఆలయంలో..



బాలాజీ నగర్ సీతారామస్వామి మందిరంలో..

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు



పర్యాటక శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని టూరిజం అతిథి గృహంలో ఆధునికీకరించిన పర్యాటక శాఖ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో టూరిజం ప్రదేశాల్లో పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, మ్యూజియంలు, బీచ్‌ల విశేషాలు, వసతి సౌకర్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదం అందించడమే లక్ష్యంగా పర్యాటక కేంద్రాలను తీర్చిదిద్దాలని సూచించారు. తొలుత పర్యాటక శాఖ కార్యాలయ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యటక శాఖ అధికారి ఉషశ్రీ, తహసీల్దార్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మూల్యాంకన విధానం రద్దుకు వినతి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ విద్యావ్యవస్థకు పెను ప్రమాదంగా మారిన నూతన మూల్యాంకన విధానం (సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్ పేపరు)ను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దశరథరాములు, హజరత్ తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత మూల్యాంకన విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలన్నారు. 22 మంది ఎంఈఓల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా వారికి షోకాజు నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు.

⇨ పరీక్షల్లో నూతన విద్యా విధానం పేరుతో తీసుకొచ్చిన సెల్ఫ్ అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెస్‌మెంట్ బుక్‌లెట్ మూల్యాంకనం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, దీని వల్ల టీచర్ల బోధనకు, విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్సీ ఏర్పాటు చేయడంతో పాటు ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. పెండింగ్ డీఏలను చెల్లించడంతో పాటు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరురూరల్: ఈనెల 25 నుంచి రేషన్‌కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, వీటి పంపిణీలో అధికారులు, రేషన్ డీలర్లు జాగ్రత్తలు పాటించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అధికారులు, రేషన్ డీలర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు 1వ తేదీ లోపు తీసుకోకుంటే రేషన్ డీలర్ల ద్వారా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ విజయ్‌కుమార్, డీఎం అర్జున్‌రావు, ఏఎస్‌ఓ అంకయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు ప్రత్యేక వాహనాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఒంగోలులో శనివారం తలపెట్టిన సీపీఐ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి శుక్రవారం పిలుపునిచ్చారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయం నుంచి శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక వాహనాలు బయలుదేరుతాయని వివరించారు.


29 నుంచి తెలుగు భాషోత్సవాలు

నెల్లూరురూరల్: నగరంలోని పుర మందిరం ప్రాంగణంలో ఈనెల 29, 30, 31వ తేదీల్లో మూడు రోజుల పాటు తెలుగు భాషోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలుగు భాషా సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది సాహితీవేత్తలు, రచయితలు, కవులు పాల్గొంటారన్నారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రేబాల వీధి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో రామ్‌నగర్, ఏసీ నగర్, బాలాజీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, బాబూ గిరిజన కాలనీ, నవాబుపేట, ఎన్సీ బాలయ్య నగర్, గ్రంథాలయ వీధి, నజీర్‌తోట, బాలాజీనగర్, గౌడ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఈ

నెల్లూరు(బారకాసు): స్థానిక రామలింగాపురం కూడలిలోని అన్న క్యాంటీన్‌ను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. క్యాంటీన్ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. సురక్షిత తాగు నీటిని అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని డైకస్ సెంటర్ దగ్గర ఉన్న పొగాకు గోడౌన్ ప్రాంగణంలో గత వారం రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చివరి రోజు శ్రీకృష్ణుని నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. పొగాకు గోడౌన్ నుంచి ఎన్సీసీ కాలనీ, పొదలకూరు రోడ్డు, చాణక్యపురి రోడ్డు, మహిళా ప్రాంగణం, రామచంద్రాపురం, శాంతినగర్, గాంధీనగర్, చైతన్యపురి కాలనీ తదితర మార్గంలో నగరోత్సవం సాగింది. ఆ కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి, నగర కమిటీ సభ్యులతో పాటు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మన్నేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకులను కలిసిన పర్వతరెడ్డి



రాష్ట్ర నాయకులతో మాట్లాడుతున్న పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రులు పేర్ని నాని, శైలజానాథ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం కలిశారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ నివాసంలో కలిసి, పలు అంశాలపై చర్చించారు. అనంతరం టీడీపీ గూండాల చేతిలో ధ్వంసమైన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పామాయిల్ తోటను పరిశీలించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి



డ్రమ్ములోని నీటిని పారబోస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధులను నివారించేందుకు వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా సహాయ నివారణాధికారి నాగార్జునరావు సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా నగరంలోని వైకుంఠపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు నివాసిత ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ఉన్న నీటి తొట్టెలు, డ్రమ్ములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ వారానికి ఒక రోజైనా నీటి తొట్టెలు, డ్రమ్ములు, బక్కెట్లను శుభ్రం చేసి ఎండబెట్టాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ, మలేరియా లాంటి పలు రకాల జబ్బులు రావన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది లక్ష్మీనరసయ్య, కేశవులు, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు



లాటరీ తీస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని మైపాడు గేటు రోడ్డు, జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' ప్రాజెక్టులో 120 దుకాణాలను లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు శుక్రవారం కేటాయించారు. ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో లాటరీ విధానాన్ని లబ్ధిదారుల సమక్షంలో అమలు చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లీలారాణి, నగరపాలక సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి, ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫీసర్ ప్రణతిఫోరా, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, మెప్మా సిబ్బంది సుధాకర్, కవిత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని చక్రాలవారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిరంలో శుక్రవారం సామూహిక మహన్యాస రుద్రాభిషేకార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవని అనిల్‌కుమార్‌శర్మ, చక్రాల వెంకటలక్ష్మీనరసింహంలచే పూజలు జరిగాయి. తొలుత మందిరంలో కొలువైన దేవతలకు, శంకరభగవత్పాదుల వారికి అభిషేకం, అష్టోత్తర శతనామార్చనలు గావించారు. చక్రాల ఆనంద్‌కుమార్, గన్నవరం ప్రభాకర్‌శర్మ, వి.శ్రీహరిప్రసాద్‌రావు, ఎం.ఉదయ్‌కుమార్, తంగిరాల వెంకటశ్రీకాంత్, గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ, చక్రాల నాగరత్నకుమారి, బాచిరాజు లక్ష్మీసుజాత తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు సహకరించాలి



ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ జబ్బును నివారించేందుకు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సహకరించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆయన నగరంలోని వైష్ణవి హాస్పిటల్, సాయిపథం హాస్పిటల్, మధుసూదన్‌శాస్త్రి ఆస్పత్రులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా డాక్టర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్తభారత్ కోసం ప్రణాళిక చేపట్టిందన్నారు. అందువల్ల ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేయాలని కోరారు. టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రూ.6 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. అలాగే నాణ్యమైన మందులు అందిస్తోందన్నారు. అందువల్ల ప్రైవేటు వైద్యులు కూడా భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కో–ఆర్డినేటర్ హరీష్, భవ్య కో–ఆర్డినేటర్ తులసీరామ్, ఫీల్డ్ కో–ఆర్డినేటర్‌లు సరిత, అనూరాధ పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం



నెల్లూరు(బారకాసు): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలుతో పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర మున్సిపల్ కమిషనర్లకు తెలంగాణ– తమిళనాడు ప్రాంతాల్లో ఐదు రోజుల స్టడీ టూర్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం చెన్నై పట్టణంలోని సీఅండ్‌డీ ప్లాంట్, బయో మైనింగ్ ప్లాంట్, డోర్ టు డోర్ కలెక్షన్ విధానం, సత్యవేడులోని చికెన్ వెస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లలో బృంద సభ్యులతో కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ పాల్గొని వివిధ అంశాలపై అధ్యయనం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బాలాజీనగర్ గౌడ్ హాస్టల్ వద్ద ఉన్న సీపీఎం కార్యాలయం వద్ద శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, సీపీఎం కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ కమిటీ కార్యదర్శి శేఖర్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.